పెండ్లి పిలుపు

శ్రీ ధాయిపులె బాలకృష్ణరావు

"రాధా ...! పలకవేం?" అప్పుడే వచ్చిన దినపత్రికను తిరగవేస్తూ పిలిచాడు మోహన్.

"ఆ ... ఆ ... వస్తున్నానండి! కొంచెము వోపిక పట్టండి. పాలలో డికాక్షన్ యిప్పుడే కలిపాను." వంటింట్లోంచి జవాబిచ్చింది రాధ.

"చంపావ్! బండికి వేళయింది. త్వరగా వెళ్తేనెగాని మనకు బండి అందదు."

"అంత తొందర చేయకుంటే, యీ విషయం నిన్ననే చెప్పగూడదటండీ!" కొంచెము కోపంగానే అంది రాధ. చురచుర వంటింట్లోనుండి మోహన్ కూర్చున్న గదిలోకి వచ్చింది. రాధలో వుండే ఆ కొంచెం కోపం మోహన్ మన్మథ వీక్షణాల్లో మంచుగడ్డలా కరిగిపోయింది. ఆమె కనురెప్పలు బరువుగా సిగ్గుతో క్రిందికి వాలాయి.

"ఏవిషయమంటావ్ రాధా?" చిరునవ్వుతో పలకరించాడు మోహన్.

"అదేనండి ...! మా చెల్లెలి వివాహ ఆహ్వాన పత్రిక విషయం" నెమ్మదిగా జవాబిచ్చింది రాధ.

"ఆ విషయంలో నా తప్పేముంది. పిలుపు పత్రికవచ్చి గంటగూడ కాలేదే! వచ్చినతోటె నీతో చెప్పాను. చూడూ! కాఫీ, ఫలహారము త్వరగా తీసుకరా! వేళయిందిగాని!" సున్నితంగా సమాధానమిచ్చాడు మోహన్.

"ఇంతకూ వివాహము ఎప్పుడో చెప్పారుకారు."

"మరునాడే! సందేహమెందుకూ! వెళ్ళు ... వెళ్ళు, త్వరగా కానీ."

"సామానంత సర్దండి నేవచ్చేలోగ" వంటింట్లోకి వెళ్లిపోతూ అంది రాధ.

"సర్దడానికేముంది. అదంతా ఎప్పుడో అయిపోయింది. ఇపుడు నీ సరదాకోరకు కాచుకొని వున్నా. త్వరగా రా" చిరునవ్వు నవ్వాడు మోహన్.

◆ ◆ ◆

మోహన్ రెండు సెకండ్ క్లాసు టికెట్లు మద్రాసుకు తీసికొన్నాడు.

మద్రాసు రైలు ఆ రోజు కొంచెము ఆలస్యంగానే వచ్చింది. మోహన్, రాధ, ఖాలీగావుండె సెకండ్ క్లాసు కంపార్ట్‌మెంట్‌లో ఎక్కారు.

"ఏమండీ! సామానులన్ని సరిగా ఉన్నాయి గదండి?"

"ఆ ... ఆ ... సరిగా వున్నట్లే. బోలెడు సామానులున్నట్లు మాట్లాడుతున్నావే. ట్రంకు నా దగ్గర, హ్యాండ్ బ్యాగ్ నీ దగ్గర. యింకేం ..." మెల్లగా నవ్వాడు.

"ఓహోయ్ ప్యాసింజర్లు జాగ్రత్తగా వుండండి నేబయలుదేరుతున్నా"నన్నట్లు పెద్దగా కూతేస్తూ రైలు కదిలింది.

రాధ తన చెల్లెలి వివాహము ఎంత వైభవంగా జరుగుతుందో ఆలోచించుకుంటూ, కంపార్ట్‌మెంట్ కిటికీలోనుంచి బాహ్య ప్రకృతిని చూస్తూ ఆనందించసాగింది.

రైలు ఒక స్టేషన్ వద్ద ఆగింది. రాధ పెట్టె తలుపు దగ్గరకివచ్చి నిలబడింది. తిరిగి భర్త దగ్గరికి పోయి -

"మా పిన్నిగారి వూరు యిదేనండీ. వారుగూడ యీ రోజే వస్తారు కాబోలు!"

"నిన్ననే పోయివుండవచ్చు... దానికేం !"

తిరిగి రాధ ద్వారము దగ్గరపోయి నిలబడింది.

"హల్లో రాధా !" క్రొత్త వ్యక్తి కరచాలనం కొఱకు చేయిజాపి చటుక్కున చేయి వెనక్కి తీసికొని రెండు చేతులు జోడించి "నమస్కారం" అనగలిగాడు.

"నమస్తేనండి" అంటూ కంపార్ట్‌మెంట్ దిగింది రాధ. రాధ వదనంలో చిరునవ్వు సుస్పష్టంగా ప్రతిఫలిస్తూంది.

ఇదంతా చూస్తున్న మోహన్‌కు తలతిరిగినట్లయింది. ఆ క్రొత్త వ్యక్తిని, రాధ కొంత దూరము పిలుచుకొనిపోయి మాట్లాడుకుంటూ నిల్చుంది, వారి సుస్పష్టంగా వినబడని సంభాషణలు వింటూ కూర్చున్నాడు మోహన్.

"కాలేజినుండి విడిపోయి మరి యిన్నాళ్లకు మనం మీటయినామండీ అదంతా దేవునికృప ఆనాలిసిందే. ఏమంటారు ?"

"నిజమే రాధా" చిరునవ్వుతో తలవాలుస్తూ జవాబిచ్చాడు క్రొత్త వ్యక్తి.

"ఈ మధ్య క్రొత్తగా వెలువడిన 'అభ్యుదయ' పత్రికలో ప్రచురణమైన మీ కథానికలు చదివాను. అవి చాల బాగున్నాయ్. ఆ పత్రికకే మీ కథానికలు ఒక క్రొత్త శోభను కూర్చాయి. ఇంకా చెప్పాలంటే ..."

"ఇక అంతటితో చాలించు రాధ. ఈ నాటి అభ్యుదయ కవులకు ఆకాశాన్ని మించిపోయి పొగడ్తలు ..." చిరునవ్వు నవ్వి "అనవసరం" ముక్తసరిగా జవాబిచ్చాడు.

ఇంకా ఏవేవో మాట్లాడుకున్నారు. అవి స్పష్టంగా వినబడలేదు మోహన్‌కు.

"ఓ ! యటీజ్ ఫయివ్ మినట్స్ మోర్ వన్లీ. వస్తా గుడ్ బై." సుందర దరహాసము చేస్తూ రాధ వెనక్కి మళ్లింది.

"ఓ. కె" క్రొత్త వ్యక్తి చేయి ఊపాడు చిరునవ్వుతో.

రైలు కదిలింది. మోహన్, రాధ మౌనంగా కూర్చున్నారు. మోహన్ తనను ఏమైన అడుగుతాడనే కంగారు రాధకువుంది. అవకాశము కొరకు కాచుకొని కూర్చుంది. భర్తవేపు ఒకసారి తిరిగి చూసింది. మోహన్ వదనంలో ఏదో అవ్యక్తమైన బాధ యిమిడివుందని గ్రహించింది.

"రాధా" పలుకరించాడు మోహన్.

"..........."

"ఇందాక నీతో మాట్లాడిన ఆ సూటు, బూటు వేసిన పెద్దమనిషెవరు ?" సిగరెట్టు ముట్టిస్తూ ప్రశాంతంగా అడిగాడు. బాధ మాత్రం మనసులో ప్రగాఢంగా అలుముకొనివుంది.

"......" ముసి, ముసి నవ్వు నవ్వింది రాధ.

"అతగాడు చాల మంచివాడుకదూ. చాల సన్నిహితంగగూడ మాట్లాడాడుకదూ !"

"అవునండి" ముసిముసి నవ్వింది రాధ.

"ఊఁ" మనసులో మాత్రం కోపం అధికంగానే వుంది. కాని దానిని బయటికి తీసుకొని రావడానికి సమయంకొరకు నిరీక్షిస్తున్నాడు.

"ఆయనతో నీ కింతకుముందునుండి పరిచయముందా ?"

"ఊఁ ఉందండి" తలూపుతూ అంది రాధ.

"ముఖపరిచయమేనా ?" సిగరెటు దమ్ము ఘాటుగా పీల్చాడు.

"గృహపరిచయంగూడానండి."

మోహన్‌కు వొల్లు మండింది.

"ఊఁ అందుకే ఆడవారికి అలుసివ్వరాదన్నారు. రాధా ! అడుగుతున్నా నిజం చెబుతావా ! చెప్పవా ! ఆ పెద్ద మనిషెవరు ? ఆయనతో నీకేం

పని? నవ్వుతూ, కులుకుతూ ప్లాట్‌ఫారమ్‌మీద నిలబడి ఆయనతో మాట్లాడ్డం నీకేం పని?”

“ఏమిటండి అలా కోప్పడుతున్నారు? నన్నపార్థము చేసికొని ఏమేమో మాట్లాడుతున్నారే?” రాధ లోలోన నవ్వుకుంది.

“కాదు అర్థము చేసికొనే మాట్లాడుతున్నా. నీ గుణం యిలా పయోముఖ విషకుంభంలా వుంటుందని నేనెప్పుడు అనుకోలేదు. ఇప్పుడు గ్రహించాను. నీ హృదయం ఎంత కల్మషమైందో!”

“అంతటితో ఆగండి. ఆయనెవరో మీకెందుకండి?” చిరునవ్వుతో జవాబిచ్చింది రాధ.

“నాకెందుకూ - బాగుంది! ఈ సారి ఖచ్చితంగా అడుగుతున్నా. చెబుతావా? లేదా?” గ్రుడ్లురిమిస్తూ అడిగాడు.

“అంత కోప్పడితే ఎలాగండి? కోపంవస్తే కొరుక్కుతినరుగదండీ” అంటూ నవ్వసాగింది.

“అంతా వేళాకోళమాడుతున్నావే?”

“ఆయన చాల మంచివారండీ. ప్రశాంత మూర్తులు.” రాధ ఆ మాత్రం అనగలిగింది.

“అలాగండీ ...” వెకిలిగా చెబుతూ “ఎవరో చెప్పావుకాదసలు?” అని ప్రశ్నార్థకంగా అడిగాడు.

“ఆయనతో నా ...” నవ్వు ఆపుకోలేకపోయింది రాధ. భర్త అవివేకాన్ని తెలిసికొని.

“చెప్పవేం ...?”

“ఆడవారికి అంత మాత్రం హక్కు లేదండీ ...?”,

“ఊహు. మగవారితో మాట్లాడగూడదు.”

“అలాగైతే మగవారు ఆడవారితో మాట్లాడగూడదు.”

“అదలాగౌతుంది.”

“ఇది ఎలాగౌతుంది. సమానత్వం, సమానత్వం అంటారే-యిదేనా సమానత్వం?”

“ఏంతత్వమో మరి. నీ తత్వం, నా తత్వం రెండూ ఏకంకావాలంటే కష్టం. బహు చక్కగా వాదిస్తావే! ఓహో ... ఐ యామ్ సారి! యింటర్మిడియట్‌లో లాజిక్ చదివావని ఒకసారి చెప్పినట్లు జ్ఞాపకం. ఊఁ సరేగాని, మీ ప్రణయ సంభాషణ లేవో చెప్పావుకాదే?”

“ఏమిటీ” రాధ ప్రశ్నించింది. ఇంతవరకూ కథ వస్తుందని రాధ ఎప్పుడో వూహించింది.

“ప్రణయం”

“మీరేదో నాపై ప్రళయం తెస్తున్నారే!”

“చెబుతావా - చెప్పవా?” మోహన్ తనలో తాను విసుగుకున్నాడు - ఎంతకూ రాధ జవాబు చెప్పకుంటె.

“ఆగండి. అంత తొందరపడితే ఎలాగు. తొం...ద...ర...ప...డ...రా...దు. తొందరపడరాదన్నారు పెద్దలు. మీరేదో దానికి విరుద్ధంగా నడుస్తున్నారే!” ప్రశాంతంగా అంది రాధ.

మోహన్‌కు అరికాలిమంట నెత్తికెక్కింది.

“మీ యిద్దరిమధ్య సంభాషణ జరగడానికి కారణం అంతా ఒక్కసారిగా చెబుతావా, లేదా?”ని

“శాంతించండి. చెబుతాను....దప్పికౌతుందండి. కొంచెం మంచి నీళ్లు కావాలి.”

“మం...చి...నీ...ళ్లు” అక్షరాలను ఒత్తిపలికాడు కోపంతో. “అదుగో మరచెంబు తెచ్చావే, త్రాగు” హుంకరించాడు.

నీళ్లు కొంచెము మాత్రము త్రాగి “అమ్మయ్య! దప్పితీరింది. మీ సందేహతృష్ణ తీరుస్తాను ... మరే ఆయనపేరు చంద్రం ... మరే ...”

“మరేలేదు గిరేలేదు. ఆలస్యంచేయక చెప్పు.”

“అవునండి ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు. ఆయన, నేను కాలేజిలో యింటర్ చదివే

రోజుల్లో, ఆంధ్ర సారస్వత సమితికి అధ్యక్షులుగా నిలబడ్డారు. ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు, మా కాలేజి మాక్ పార్లమెంటులోగూడ ఆయనే అధ్యక్షుడు. ఉపన్యాస మివ్వడంలో ఆరితేరిన హ్యాండ్ అండి! ఆయన యీ మధ్య, కథానికలు వ్రాయడం, పత్రికలకు పంపడం, ప్రచురణ కావడం, ఆయన కథలను పాఠకలోకమంతా చదివి ఆనందించడం పరిపాటైంది. ఆయనిప్పుడు బి. ఎ. చదువుతున్నాడు."

"సరేగాని ఆయనతో మాట్లాడ్డం నీకేంపని ?"

"అలాగండీ ... ఆగండి చెబుతాను." గుటక దిగమ్రింగింది రాధ.

"చెప్పగూడదూ ... ఆగడమేమిటే? నేను ఆగడమేమిటి ?"

"ఆడవారిపై అంత అనుమానం ఎందుకండీ మీకు? అనుమానం ప్రాణసంకటం. సరేగాని మీరు డాక్టరు దగ్గరికి వెళ్ళాలండి" ముసిముసి నవ్వు నవ్వింది రాధ.

"ఎందుకూ నాకు జబ్బా ఏమైనా!"

"అవునండి! మీకు కళ్ళజోడు కావాలి..."

"అబ్బా! ఏమిటానవ్వు. చెప్పేదేమిటో సరిగా చెప్పగూడదూ ... నాతో అపహాస్యమాడుతున్నావే!"

"కాకుంటే మరేమిటండి, అంతమటుకు గుర్తుపట్టకుంటే ఎలాగండి! మా పిన్నికొడుకూ, మీ బావమరిది చంద్రాన్ని గుర్తుపట్టలేకపోయారు గదండి." రాధ భర్త అవివేకాన్నిచూసి నవ్వసాగింది. మోహన్ తెల్లబోయాడు.

"ఎవరూ ...! రామచంద్రమా. నా తెలివి తెల్లారినట్లేవుంది. మరి నువ్వు చెప్పావుకావే. వాడి డ్రెస్సు, సూటు, బూటు, చలువ అద్దాలు, నిక్కరు, సీటు - అవన్నీచూసి ఎవరో అనుకొన్నాను. చాల మారిపోయాడేవాడు."

"కాలేజీల్లో చదివేవారు మారిపోక ఎలాగుంటారు ?"

"మరి, నువ్వు మొదట్నే చెప్పావుకావే! పోనీ వాడైనావచ్చి నాతో మాట్లాడిన పాపాన పోలేదే!"

"ఎందుకు చెప్పాలి! మిమ్మల్ని ఏడ్పించాలనుకున్నా. అందుకే యీ పన్నాగం" నవ్వు ఆమె పెదవులపై ఆవరించుకుంది. కడుపుబ్బ నవ్వింది.

"వాడితో చెప్పింది నేనే ..."

"ఏమని ?" సూటిగా ప్రశ్నించాడు.

"మీ బావతో చిన్న తమాషచేసి ఏడిపించాలనుకున్నానని; నీవుపోయి మాట్లాడవద్దనిగూడ చెప్పాను. సరే అంటూ తలూపాడు చంద్రం" చప్పట్లుకొడుతూ కిలకిలా నవ్వింది రాధ.

"అమ్మ దొంగ ఎంత పన్నాగం పన్నావ్! ఇంతకూ క్షమించు రాధ నన్ను! నిన్నర్థంచేసికోవలేక ఏమేమో అన్నాను."

"ఆ, ఆ ... క్షమించడానికేముందిలెండి" చిరునవ్వు నవ్వింది రాధ.

"ఇంతకూ బలే తమాష చేశావ్." మనసులో అభినందించాడు.

రైలు మామూలు వేగంకంటె కొంచెం వేగం హెచ్చించింది. ప్రక్క కంపార్ట్మెంట్నుండి వినబడుతున్న బిక్షగాని పాట వినశ్రావ్యంగావుంది. పాటకుతోడు రైలు చక్రాల శబ్దము లయగా కుదురుకుంది.

కొంతసేపటికి యింకోక స్టేషన్ వచ్చింది. అచ్చటాగింది.

"రాధా! ఆ మర చెంబులో రెండు కప్పులు కాఫీ తీసుకరాపో! యిందా రూపాయి. ఇంక రెండు స్టేషన్లు దాటాలి మనం."

"మీరు పోగూడదటండీ."

"పరువాలేదులే వెళ్ళిరా త్వరగా. ఏదో ఆడవారికి స్వాతంత్ర్యం కావాలి, సంఘజీవనంలో సమాన హక్కులుండాలని వాదిస్తుంటావే!" రాధ చిన్న చిరునవ్వునవ్వి వెళ్ళిపోయింది. రాధ వెళ్ళిన తర్వాత తనకు తాను ముసిముసి నవ్వు నవ్వుకున్నాడు.

రాధ తిరిగి వచ్చింది.

"మీరేమైనా కాఫీ త్రాగుతారా?"

"ఊహుఁ యిప్పుడక్కరలేదు."

రైలు తనపని నిర్వర్తించుకొని కదిలింది.

"రాధా!" కంగారుగా అరిచాడు మోహన్, బిత్తరపోతూ.

"ఏమండీ! ..." భయంగాను, కంగారుగాను అడిగింది రాధ.

"... ... ..." మోహన్ ఏదో వెదక నారంభించాడు ఆతురతతో. నొసట చెమట దట్టంగా క్రమ్ముకుంది. చెదిరి, బెదరిన చూపులతో అటు, యిటు చూస్తున్నాడు.

"రాధా! అయ్యో ఎంతపని చేసింది యీ 'పెండ్లిపిలుపు' ప్రయాణం" దుఃఖమంతా క్రోడీకరించి చెప్పాడు.

"ఏమైందండీ"

"హ్యాండ్ బ్యాగ్, ట్రంకు కనబడ్డంలేదు! నీ దగ్గరుందా!"

"బాగుందండి! నా చేతిలోవుండే హ్యాండ్ బ్యాగ్, ట్రంకు యీ పైసామానుల అటకమీదే కదండి మీరు పెట్టింది. నేను కాఫీ తీసుకరావడానికి వెళ్లితినే. మీరప్పుడు యిక్కడే వుంటిరి గదాండి! వాటిపై కొంచెం జాగ్రత్తవుండనక్కరలేదూ!" కళ్లెర్రజేసి అన్నది రాధ.

"అదేంటి రాధ అలా కోప్పడుతున్నావ్. నీవు వెళ్లగానే నేను ప్లాట్‌ఫారమ్‌మీదికి గాలి పీల్చుకోడానికి దిగాను. తెలీదూ?" జవాబిచ్చాడు మోహన్. అతని ముడుతలుపడిన ఫాలభాగము కంగారుగా కనబడే కళ్లు నమ్మమని చెబుతున్నాయి. నిజమని ఘోషిస్తున్నాయి.

"నాకేం తెలీదు. ఇంతకూ అయ్యో! నానగలు, పట్టు చీరలు అన్నీ ఆ ట్రంకులో ఉన్నాయే! ఎలాగండియింకా!" రాధ కొంచెము స్వార్థం కనపరచింది.

రాధకు ఏడుపువచ్చినంత పర్యంతం అయింది. నొసట చెమట పట్టింది. వొళ్లు జలదరించింది.

"ఎంతపని చేశారండీ. ప్రక్కస్టేషన్లో పోలీసులకన్నపోయి రిపోర్టు చేయండి" కళ్ళనుండి కారుతున్న నీళ్లను చీరకొంగుతో తుడుచుకుంది రాధ. భర్తవేపు తిరిగి చూసింది. మోహన్ నోటికి చేతిరుమాలు పెట్టుకొని ఒకే నవ్వు నవ్వుతున్నాడు. తాను నాటకం బాగా ఆడానని తనకుతాను అభినందించుకున్నాడు.

"ఏమండీ! అలానవ్వుతున్నారు. అవున్లేండి. నా అలంకరణ సొత్తులన్నీ పోవడం బాగైందనే కదా మీరు నవ్వేది. ఊఁ నవ్వండి ... నవ్వండి ... వొకరికి నవ్వు ... మరొకరికి ఏడుపు ... బాగుంది."

"అది కాదు రాధా" నవ్వుతూనె జవాబిచ్చాడు.

"ఏమిటిదో త్వరగా చెప్పగూడదటండీ ... ఆ ... ఆ దొంగను చూశారా! చెప్పరేం ... అబ్బ ... ఏమిటానవ్వు ..."

"ఆగు! అంత తొందరపడితే ఎలాగు"

"అబ్బ! చెప్పరేఁ స్టేషన్ దగ్గరికి వస్తుంది."

"తొం...ద.. ర...ప...డ...రా... దు...తొందరపడరాదని కదా పెద్దలు నుడివింది. దానిని నువ్వు కాసిస్తే ఎలాగు? నీవు చేసిన తమాషవల్ల నేను ఏడ్చానా, లేకుంటే ..."

"అబ్బ చెప్పగూడదటండీ ఏమిటానవ్వు!"

"…నేను చేసిన తమాషవల్ల నీవు ఏడ్చేవా ?"

"ఏమిటీ ! తమాష !! అంటే … ట్రంకు, సంచి ఎక్కడో దాచి పెట్టి వుంటారన్న మాట !" చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంది.

"అవే నిన్ను ఏడ్పించడానికి కారణమైనాయన్న మాట" వ్యంగ్యంగా చెప్పాడు. "ప్రక్క కంపార్టుమెంటులో మీ పిన్నివాళ్లున్నారు. వాళ్ళ దగ్గర భద్రంగా వుంచాను. వాళ్ళుగూడ మనతోపాటే వస్తున్నారు. నీతో చిన్న తమాషచేసి ఏడ్పిస్తానని చంద్రంతో చెప్పితే కడుపు చెక్కలయ్యేట్లు నవ్వాడు. మీ పిన్నిగారితో గూడ చెప్పాను. వారు గూడ నవ్వారులే !"

"వాళ్లు మనతో పాటు వస్తున్నారటండీ! మరి చంద్రం రేపు సకుటుంబ సమేతంగా వస్తానని నాతో చెప్పాడుగదండి"

"బాగ చెప్పాడు. తగినశాస్తి-సరేగాని యిపుడు ఏడ్పించిందెవరంటావ్ ?" పకపకనవ్వాడు మోహన్.

"నేను మిమ్మల్ని - మీరునన్ను … సరికి - సరి"

"ఎలాగైతుంది. నీవు నా మనస్సును కష్టపెట్టావ్; నేను నీ మనస్సును కష్టపెట్టి, మరీ ఏడ్పించాను. అంటే దెబ్బకు పైదెబ్బ వేశానన్నమాట. కనుక, నేను అంటే శ్రీవారు బెట్ యు యిన్ది 'గేమ్ ఆఫ్ మేకింగ్ వాన్ టు వీప్'"

"మీరుగెలువకుంటే యింకెవరు గెలుస్తారండి" చిరునవ్వు నవ్వింది రాధ.

"అంతేలే !" బిగ్గరగానవ్వాడు మోహన్ రాధ ముఖం చిన్నబోయింది. మోహన్ వదనం వికసించింది.

కొద్ది సేపటికి, యిద్దరూ ఒకరికేసి ఒకరుచూసి అప్రయత్నంగా నవ్వారు.

—X—

దసరా, దీపావళి క్రిస్మస్ పండుగలకు రైలు చార్జీ తగ్గింపులు

వచ్చే దసరా, దీపావళి, క్రిస్మస్ శెలవల కాలంలో నిరుటేడులాగే ఈ సంవత్సరంకూడా రైల్వేబోర్డు చవక టిక్కెట్లు ఇవ్వడానికి నిశ్చయించిందని ఒక అధికార ప్రకటన చేశారు.

దసరా పండుగకు సెప్టెంబరు 20నుంచి అక్టోబరు 8దాకా తిరుగు ప్రయాణపు టిక్కెట్లు ఇస్తారు. ఇలాగే, దీపావళికి, అక్టోబరు 19 నుంచి 24 దాకానూ, క్రిస్మస్‌కి డిశంబరు 15 నుంచి 1958 జనవరి 5 దాకానూ తిరుగు ప్రయాణపు టిక్కెట్లు ఇస్తారు.

ఒక ప్రయాణం చెయ్యడానికయ్యే టిక్కెట్టు ఖర్చులో నాల్గవభాగం తగ్గించి ఈ తిరుగు ప్రయాణపు టిక్కెట్లు అమ్ముతారు.

ఈ టిక్కెట్లు, అవి కొన్న రోజూ, తిరుగుప్రయాణం పూర్తిచేసిన రోజూ కలుపుకుని, పదిహేను రోజులలోగా వాడుకోవాలి.

150 మైళ్ళపైన చేసే ప్రయాణానికే ఈ టిక్కెట్లు ఇస్తారు. తిరుగు ప్రయాణంలో మధ్యలో ఎక్కడా ఆగకూడదు. వెళ్లేటపుడు మాత్రం దారిలో ఎక్కడైనా దిగవచ్చు.

P. I. B